# రేపటి సూర్యోదయం

నా కళ్లు జిగేలుమన్నాయి.

ఎదురింటి మేడమీద మెరిసిన మెరుపుకు నేను ఉక్కిరిబిక్కిరి అయ్యాను. రెండు రోజుల క్రితం కొత్తగా వచ్చారు. పిల్లా జెల్లా, జనంతో హడావుడి. సామాన్లను చిన్న ట్రక్కులో దింపారు. నాలుగు రోజులకే నిశ్శబ్దమేర్పడింది వచ్చిన వాళ్ళంతా వెళ్లిపోయారు అన్నట్లుగా. కానీ ఆ మెరుపు అలాగే వుండిపోయింది నా కళ్లను వెలుగుతో నింపుతూ.

నిద్రలేస్తూనే హడావుడిగా తలుపు తీసి మొట్టమొదటిసారిగా ఆ మేడ మీదకే చూస్తాను సూర్యుడిని చూస్తున్నంత భక్తిగా. అయిదు నిముషాలు పరీక్షగా చూపును కేంద్రీకరించి వుంచితే కిటికీలో నుండి అటూ ఇటూ ఆ గదుల్లో తిరిగే మెరుపు నాకు కనువిందు చేస్తుంది. నాకు తొమ్మిది గంటలదాకా ఆ పనీ, ఈ పనీ చేస్తూ కిటికీ వూచలు పట్టుకు నిలబడటమే ఓ పనిగా అయింది. మరీ తలుపు తెరుచుకు నిలుచోడం బాగుండదు కనుక ఆ సమయంలో నాకు మరే రాచకార్యాలు లేకపోవడంతో కొత్తగా ఏర్పడిన ఈ కార్యక్రమమే ముఖ్యమయినదిగా మారిపోయింది.

ఆ అమ్మాయి గాక ఆ ఇంట్లో మరో ముసలామె కనబడుతున్నది. ఎప్పుడైనా ఒక్కసారి బయటకు వచ్చి అటూ ఇటూ చూచి లోపలకు వెళ్తుంటుంది.

నేను తొమ్మిది దాటిన తరువాత నా గదిలో నుండి బయటపడతాను. నడుచుకుంటూ వెళ్ళి, చిక్కడపల్లి సెంటర్లో వున్న స్వరాజ్య హోటల్లో భోజనంచేసి, బస్సెక్కితే మా ఆఫీసు దగ్గర దిగటానికి పావుగంట పడుతుంది.

ఆ రోజు సాయంత్రం ఇంటికి వస్తూనే గేటులోపల కాలు పెట్టకుండానే తలెత్తి ఎదురు మేడ మీదకు చూశాను... మెరుపు!

బాల్కనీలో వరసగా పెట్టిన చిన్న చిన్న పూలకుండీలలో నీళ్లు పోస్తోంది.

కొద్దిగా వంగి బక్కెట్‌లో నీళ్ళు మగ్గుతో ముంచి పోస్తున్నప్పుడు ఆమె పొడువైన జడ ముందుకు జారి వేలాడుతూ ఆమెకు మరింత అందాన్నిస్తోంది. పైట అస్తవ్యస్తమయి మరింత మత్తెక్కిస్తోంది.

ఎంతగా ఆకర్షిస్తున్నదీ అంటే నేను నా గది తలుపుకున్న తాళాన్ని తీయడానికి పదినిముషాల పైనే పట్టింది. నేను బొమ్మలా ఆమెను అలాగే చూస్తుండిపోయాను.

అలా మొక్కల్లో నీళ్లు పోస్తూ పోస్తూ ఎందుకో తలెత్తి నావంక చూసినప్పుడు నేను ఉలిక్కిపడ్డట్టుగా ముఖం తిప్పుకొని గది తాళం తీశాను- ఆ అమ్మాయి కళ్ళార్పకుండా బొమ్మలా తననే చూస్తున్న నా గురించి ఏమనుకుంటుందో?

అదే అమ్మాయిలతో వచ్చిన చిక్కు మగవాళ్ళని మత్తెక్కించే రూపాలు. వాళ్ళనీ, వాళ్ళ అందాలనీ చూడకుండా వుండలేము. అలా చూస్తున్నప్పుడు వాళ్ళు గమనిస్తే పట్టుబడిన దొంగలా మనఃస్థిమితాన్ని కోల్పోవడం... ఇప్పుడు అదే అయింది నా విషయంలోనూ!

తలుపుకు తీసిన తాళాన్ని లోపలివైపు గడియకు తగిలించి మరోసారి తలెత్తాను.

ఆమె నా వంకే చూస్తోంది. అంతేకాదు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తూ చిన్నగా నవ్వింది.

నాలో తత్తరబాటు ఆమెకు స్పష్టంగా కనబడిందేమో పెద్దగా నవ్వేసి చటుక్కున లోపలకు వెళ్ళిపోయింది.

నేను తలుపును దగ్గరకు వేశాను. చొక్కా విప్పి హ్యాంగర్‌కు తగిలించి కూజాలో నీళ్లు వంపుకొని గడగడా త్రాగాను. బాత్రూంలోకి వెళ్ళి నీళ్ళతో ముఖం కడుక్కొని తువ్వాలతో తుడుచుకుంటూ ఉత్సుకతతో కిటికీలోనుంచి ముందు మేడవైపుకు చూశాను.

కిటికీలోనుంచి నా వైపుకే చూస్తున్న ఆమె నేను అటు చూడగానే నా వైపుకు చేయి ఊపింది... నా ముఖంలో కలవరపాటు.

అదొక అర్థంకాని అయోమయ అవస్థ!

ఆమె చొరవ నాకు చాలా విచిత్రంగా తోచింది. ఆమె ఉద్దేశ్యమేమిటో నాకు అర్థంకావడంలేదు. పరిచయంలేని నాతో అలా ప్రవర్తిస్తున్నదీ అంటే?

కానీ నాలో అటు చూడకుండా వుండలేని తపన.

కోరికలను నిలవరించలేని వయస్సు. దృఢమైన శరీరంలో చంచలమైన మనస్సు. ఎంతటి నిగ్రహపరుడైనా అందమైన ఆడదాని ఆహ్వానాన్ని తిరస్కరించగల శక్తిమంతుడు అవుతాడని నేననుకోను.

నిజంగా ఆమె అప్సరస. అందులో సందేహంలేదు.

నా అందమూ నలుగురు అనుకునేలా తక్కువదేమీ కాదు. అదే ఆమెను ఆకర్షిస్తున్నదేమో నాకు అర్థం కావడం లేదుగానీ ఆమె నాతో స్నేహం చేయడానికి ఉవ్విళ్ళూరుతున్నదనేది ఆమె చేష్టల్లో స్పష్టంగా కనబడుతున్నది.

కొన్ని వందల గజాల దూరం నుండే కనబడుతున్న ఆమె నన్ను ఆమె వైపుకు అయస్కాంతంలా లాగుతుండగా నేనేం చేయాలో తెలియనట్లుగా ఆమెనే చూస్తుండిపోయాను. ఆఫీసులో ఆడపిల్లలతో మాట్లాడటం వేరు. ముక్కూ మొహం తెలియని అందమైన ఆడపిల్ల చేతులూపి మరీ ఆహ్వానించటం వేరు.

ఇలాంటి విషయాలల్లో మరొకరి సలహా తీసుకోవాలన్నా సిగ్గుగానే వుంటుంది.

ఆ సాయంత్రం సెంటర్‌లో వున్న బేకరీలో బ్రెడ్ కొనుక్కుందామని మెట్లెక్కుతున్నప్పుడు ఆ బేకరీ మెట్లు దిగుతున్న ఆ మెరుపును అంత దగ్గరగా చూస్తూ కలవరపడ్డాను.

బిస్కెట్ ప్యాకెట్లున్న చేయెత్తి, 'హలో' అన్నట్లుగా పెదాలు కదిలించింది.

నేను తడబడ్డమాట వాస్తవం.

"నా ఊహ నిజమయితే మా ఇంటి ఎదురుగా వున్నది మీరే కదూ?" పెదవులు వంకరతిప్పి కిసుక్కున నవ్వింది. ఆమె కళ్ళుమూసి తెరిచింది. ఆమె కనురెప్పలు ఓ పొడువాటి పడవలా వంకర తిరిగి ఆమె ముఖానికి వింత అందాన్ని చేకూరుస్తున్నాయి. నవ్వుతున్నప్పుడు ముత్యాల్లా మెరుస్తున్న తెల్లని పలువరస. కొనతేలిన ముక్కు. పెద్ద పెద్ద కళ్ళు. ఎర్రటి ముఖం మీద కాస్త పొడుగ్గా దోసగింజంత బొట్టు. ఒక్కసారి చూస్తే మరిచిపోలేని రూపం.

నాకు నోటమాట పెగలడంలేదు.

"మీరు కొనేవేవో తొందరగా కొంటే మీతోపాటు స్కూటర్‌మీద నేనూ ఇంటికి వస్తాను!"

ఇలాంటి అనుభవం కొత్త. లక్ష కోరికలు వుండవచ్చు. ఎన్నో మధురక్షణాల్ని స్వాప్నిక జగత్తులో రూపొందించుకోవచ్చు. కానీ వాటిని నిజజీవితంలో ఆచరణలో పెట్టగలిగే క్షణాలు వస్తే ఎలా ప్రవర్తించాలో అర్థంగాని తపన.

ఆమె నవ్వు నా మీద ఉసికొలుపుతున్న బాణంలా వున్నది.

చటుక్కున లోపలకు వెళ్ళి బ్రెడ్ తీసుకొని బయటకు వచ్చాను.

"నన్ను మీతోపాటు తీసుకు వెళుతున్నారా లేదా?" కళ్ళు పైకెత్తి విల్లంబులా నుదురు ముడివేసి అడిగింది.

అంత అందమైన ఆడపిల్ల స్కూటర్ మీద వెనుక కూర్చుంటాను అంటే ఎంత జడుడైనా కాదని ఎలా అనగలడు?

"నేను మీ ఇంటి ఎదురుగా వుంటానని మీకెలా తెలుసు?" కావాలనే అడిగాను.

"మీకు అందమైన ఆడపిల్లలు ఎలా గుర్తుంటారో... మాకూ అందమైన మగవాళ్ళు అలాగే గుర్తుంటారు" మరోసారి కిసుక్కున నవ్వింది.

స్కూటర్ స్టార్టుచేశాను. వెనుక ఆమె ఎక్కుతూ, "మామూలుగా కూర్చోవచ్చా? దూరంగా కూర్చోవాలా?" అన్నది.

ఆమె గొంతులో స్పష్టంగా నాకు ఎగతాళి కనిపిస్తున్నది. "మీ ఇష్టం."

నీళ్ళలో మునగ కూడదు. మునిగిం తరువాత చలికి వెరవకూడదు. ఇక లోకుల సంగతా? జానేదో...

"థాంక్యూ!"

దూరంగానే కూర్చున్నది. పోతున్నప్పుడు దగ్గరకు జరుగుతుందేమో నాకు తెలియదు.

"మీరు ఏం చేస్తుంటారు?"

"ఎమ్మే సైకాలజీ అయిపోయింది. ప్రాక్టికల్స్‌లో వున్నాను!"

"అంటే?"

"అంటే ప్రస్తుతం మనుష్యులను చదవడమే నాపని" నాకు కనబడకపోయినా ఆమె నవ్విందని నాకు అర్థమయింది.

ఒక్క క్షణం- ఇంత అందమైన అమ్మాయి మెంటల్ అయివుండదుకదా అనే అనుమానం వచ్చింది. భయపడ్డాను.

హైదరాబాద్ రోడ్లమీద అస్తవ్యస్తంగా నడుస్తున్న మనుష్యులనీ, బస్సులనీ, కార్లనీ, ఆటోలనీ, స్కూటర్లనీ ఛేదించుకుంటూ నేను ముందుకు దూసుకుపోతున్నాను, నా ప్రజ్ఞాపాటవాలన్నిటినీ ఉపయోగించి.

ఒక్క ఆఫీసుకే అయితే బండిని బయటకు తీయను. ఇవ్వాళ దిల్‌షుక్‌నగర్‌లో రామం దగ్గరకు వెళ్ళటానికి స్కూటర్ బయటకు తీశాను.

రామం నా చిన్ననాటి స్నేహితుడు.

ఏమైతేనేం మెరుపుతో పరిచయమవడానికి అది దోహదం చేసింది.

"వచ్చిన చుట్టాలంతా వెళ్ళినట్లున్నారు?"

"నన్ను బాగానే అబ్జర్వ్ చేస్తున్నారన్నమాట!"

ఆమెకు కనబడకపోయినా చిన్నగా నవ్వాను.

"ఎదురు ఇల్లేకదా?" దాంట్లో పెద్ద ప్రత్యేకత లేదన్నట్లుగా అన్నాను. "అవునూ ఆ పెద్దాయన మీ తండ్రా?"

"అవును. అందుకే వెళ్ళగొట్టేశాను!"

"అదేమిటి?"

"ఆ ఛండాలుడంటే నాకు పరమ అసహ్యం గనుక!"

✣ ✣ ✣

నేను బ్రేకును బలంగా తొక్కడంతో తూలి నా భుజం మీద వాలిపోయింది సరోజ.

అప్పుడు సరిగ్గా మధ్యాహ్నం ఒంటిగంటయింది.

ఉడ్‌లాండ్స్‌లో భోజనం చేసి ఏదైనా మ్యాట్నీకి వెళ్దామా అన్నట్లుగా బయలుదేరాం.

అది సరోజతో పరిచయమైన మూడోరోజు.

వంకర తిరిగివున్న ఆ పొడుగాటి కనురెప్పల వెనగ్గా వున్న అందమైన కళ్ళను చూస్తుంటే నన్ను నేను మరిచి పోతున్నాను.

దేవుడు ఓ దేవతను సృష్టించి నా అదృష్టం కొద్దీ నా ముందు వదిలేశాడా అన్నట్లుగా ఆమె ముఖంలోకి చూస్తూ కాలాన్నే మరచి తన్మయత్వం చెందుతున్నాను.

"సినిమాకు వెళ్లాలనే వున్నది. ఆ చీకట్లో తెరమీద కనబడే కృత్రిమ అందాల్ని చూస్తూ కూర్చునే దానికంటే పచ్చని చెట్ల నడుమ ఇందిరాపార్క్‌లో కూర్చొని కబుర్లు చెప్పుకోవడం ఆనందంగా వుంటుంది కదా!" అన్నాను.

"నాకు ఆ వెధవ బోడి కబుర్లంటే ఇష్టం వుండదు."

"ఏం?" అన్నాను ఓ కిళ్ళీకొట్టు ముందు స్కూటర్ ఆపుతూ రెండు కిళ్ళీలు తీసుకుందామని.

"ఏముంటాయ్ మన మధ్య కబుర్లు. మీదే ఊరు అంటారు. మీరు ఎంతవరకూ చదివారు అంటారు. మీరేదైనా ఉద్యోగంచేస్తున్నారా అంటారు. మీకు అన్నలెంతమంది, తమ్ముళ్ళు ఎంతమంది అంటారు. అక్కా చెల్లెళ్ళు ఎంతమంది అంటారు. మీ ఇష్టాలేమిటి అంటారు. ఆ ప్రశ్నలకు నా సమాధానాలమీద మరిన్ని చిలక్కొట్టుడు ప్రశ్నలు... ట్రాష్... అర్థంలేని ప్రశ్నలు. అర్థంలేని సమాధానాలు. అంతేగా. హాయిగా ఏ ఫైటింగ్ సినిమాకు వెళ్ళామనుకోండి... దాన్ని మనం ఎక్కడనుండి ఎక్కడిదాకా చూసినా సినిమా అర్థం కాలేదనే ప్రశ్నే వుండదు. పాటలంటారా! ఇప్పుడు మనం చెవులు కోసుకునేటంత మంచిపాటలేం రావడంలేదుకదా మిస్సయిపోతాం అనుకునేటందుకు" గుక్క తిప్పుకోకుండా అనేసి ఫక్కున నవ్వింది.

కిళ్ళీ కట్టించుకొని ఆమెకొకటి ఇస్తూ, "ఓకే... ఓకే" అని స్కూటర్ స్టార్టు చేశాను.

సినిమాహాల్లోకి వెళ్ళి గంట గూడా కూర్చోలేదు. "నాకు తలనొప్పిగా వున్నది" అంటూ నసుగుడు మొదలు పెట్టింది.

"అయితే తరువాతది నా సలహానే. నేను ముందే చెప్పానా హాయిగా పచ్చగడ్డిలో కూర్చుని కబుర్లు చెప్పుకుందాం అని!"

"ప్రతిదాంట్లోనూ మగవాడి మాటే చెల్లుతుందని ఆ మగపక్షపాతి దేవుడు ఎప్పుడో రాసిపెట్టాడు. ఏం చేస్తాం పదండి."

ఇంటర్వెల్లులో ఇద్దరం బయటపడి ఇందిరాపార్కులో చెట్టు కింద జేరాం.

"ఒక్కటి చెప్పండి నాకు... మీ వాళ్ళనందరినీ వెళ్ళగొట్టానంటున్నారు. మీరూ ఆ ముసలమ్మే అంత పెద్ద ఇంట్లో వుంటున్నారు గదా. ఉద్యోగపు వేటా? ఏం చేయాలని ఇక్కడ?" గడ్డిలో కూర్చుంటూ ఆమెనే చూస్తూ అడిగాను.

ఆమె కళ్ళను ఒక్కసారి అటూ ఇటూ తిప్పి వెనక పక్కగా నడుం కిందగా చీర ఒక పొరను పైకిలాగి గడ్డిలో కూర్చుంటూ "నేను చేసింది సైకాలజీ అన్నాను కదా. లైఫ్‌ను ఎంజాయ్ చేస్తూ మనుష్యుల్ని చదివేయాలని" అన్నది.

"బాగా ఆస్తిపరులన్నమాట!"

"నా అందమే నా ఆస్తి. నా ఆస్తిని చూస్తూ మీ ఆస్తిని కరిగించుకుంటుంటే నేను ఆనందిస్తుంటాను!" పకపకా నవ్వింది నాలుగువైపులా చూస్తూ.

ఆ సమయంలో మా చుట్టుపక్కల అంతగా మనుష్యులు లేకపోవటం కొంతవరకు నా అదృష్టం.

ఆమె నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇబ్బందిగా అటూ ఇటూ చూస్తూ ఉండిపోయాను.

"బయలుదేరండి. జనం లేని ఈ పార్కులో మాత్రం ఎంతసేపు ఈ చచ్చు కబుర్లతో ఒకళ్ళనొకళ్ళం చూసుకుంటూ కూర్చుంటాం. మా ఇంటికి వెళ్ళి హాయిగా గంటల్ని నిముషాల్లా గడిపేద్దాం, పదండి!" అంటూ లేచి నిలబడి నేను నిలబడటానికి తన చేతినందించింది.

నేను ఆ అవకాశాన్ని జారవిడుచుకోలేనట్లుగా నా చేతిని అందిస్తూ ఆమెను నా వైపుకు లాగుతూ నిలుచున్నాను.

స్కూటర్ స్టార్టు చేసిన తరువాత వెనకాల కూర్చొని నా భుజం మీద చేయి వేసి లోయర్ ట్యాంక్‌బండ్ మీదకు మలుపు తిరుగుతుండగా, "మీరు నన్ను ఇక్కడే వదిలేసి వెళ్ళనూ అంటే మీకో నిజం చెబుతాను!" అన్నది.

"చెప్పండి."

"మీరు ఎదో వట్టి కబుర్లకోసం నన్ను ఎప్పుడూ ఈ స్కూటర్ మీద అక్కడకూ ఇక్కడకూ తిప్పవద్దు. ఎంజాయ్ చేయాలీ అనుకుంటే ఏ పోష్ హోటల్లోనో మంచి రూం బుక్ చేయండి. జేబునిండా డబ్బులు వేసుకు రండి. లేదా మీకూ నాకూ కూడా టైం వేస్టు. ఎందుకీ దండగ తిరుగుళ్ళు!" చాలా సూటిగా అన్నది.

ఓ అందమైన బొమ్మ మీద ఎవరో వాంతి చేసుకున్నంత వికారమేసింది నాకు.

సరాసరి స్కూటర్‌ను ఆమె ఇంటిముందు ఆపి, "గుడ్‌బై!" అంటూ ఆమె దిగీ దిగగానే నేను నా బండిని ముందుకు ఒక్క దూకు దూకించాను.

✣ ✣ ✣

నాలుగు రోజుల తరువాత ఓ ఉదయం ఏడు గంటలప్పుడు తలుపు చప్పుడయితే ఎవరా అన్నట్లు వెళ్లి తలుపు తీశాను.

ఎదురింటి మేడ మీద ముసలమ్మ. సరోజకు తోడూ, నీడా, రక్షకురాలు!

ముఖం చిట్లిస్తూ చూశాను- ఏమిటి అన్నట్లుగా.

- ఆరోజు సరోజను స్కూటర్ మీద తీసుకువచ్చి ఆయింటి ముందు దించిన తరువాత మళ్ళీ ఆమె వైపుకే కాదు- ఆ యింటి వైపుకే నేను తలెత్తి చూడలేదు.

"మిమ్మల్ని అమ్మాయి ఒక్కసారి రమ్మనమన్నది."

"దేనికి?" విసుగ్గా అడిగాను.

"తెలియదు."

"నాకు ఇప్పుడు వీలు పడదు. నేను ఆఫీసుకు వెళ్ళే హడావుడిలో వున్నాను!" చాలా నిర్లక్ష్యంగా అన్నాను.

"నా తల్లి మూడు రోజులబట్టీ ఏమీ తినటం లేదు. ఎందుకో కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నది... మిమ్మల్ని ఎట్లాగయినా ఓ పది నిముషాలు వచ్చి వెళ్ళమంటున్నది!" ఆమె బ్రతిమలాడుతున్నట్టుగా అన్నది.

"చూస్తానులే... వీలున్నప్పుడు!" అది సభ్యత కాకపోయినా ఇక ఆమెతో మాట్లాడటం ఇష్టం లేదన్నట్లుగా తలుపులు వేసేశాను.

నేను కావాలనే వెళ్ళలేదు.

పది నిముషాలు తీరిక చేసుకోలేక కాదు... అలాంటి ఆడవాళ్ళంటేనే నాకు పరమ అసహ్యం... వాళ్ళతో నాకు మాటలేమిటి? ఛ... ఛ... డబ్బుకోసం జీవితాన్నే నాశనం చేసుకునే వాళ్ళు ఎంతకైనా తెగిస్తారనటంలో అబద్ధం లేదు.

కానీ ఆ ముసలమ్మ నన్ను వదలలేదు. రాత్రి హోటల్లో భోజనం చేసి యింటికి వచ్చి తలుపుకున్న తాళం తీస్తుండగానే గేటు నెట్టుకుంటూ లోపలకు వచ్చింది.

"ఏమిటి?"

"సరోజ మిమ్మల్ని ఒక్కసారి వచ్చి వెళ్ళమంటున్నది!" అన్నది. "మీరు రాకపోతే అది అన్నం ముట్టేటట్టు లేదు!"

"అదేంవిటి... నా రాకకూ, ఆమె అన్నం తినటానికీ సంబంధమేమున్నది?"

"నాకేం తెలుస్తుంది చెప్పండి... దాని ఉద్దేశ్యాలేమిటో నేను కనిపెట్టగలిగాను కాబట్టి మీకు చెబుతున్నాను!" ఆ క్షణాన ఆమె కంఠం కొద్దిగా కరుకుగా వున్నట్లనిపించగా నాలో కోపం చివ్వున పైకి తన్నింది.

తీస్తున్న తాళాన్ని మళ్ళీ వేసేసి, గేటును దగ్గరకు లాగి, విసురుగా పెద్దపెద్ద అడుగులతో ఎదురింటి మేడ మీదకు వెళ్ళాను.

ఎంత కోపంగా మెట్లెక్కానో, సరోజను చూచిన మరుక్షణంలోనే అంతగా నీరసించిపోయాను.

రెండు రోజుల్లోనే ఆమె చిక్కి శల్యమయింది.

ముఖంలో ఆ నిగారింపు లేదు. కళ్ళల్లో వెలుగు లేదు. పడవలా వంకర తిరిగి వుండవలసిన ఆ కనురెప్పలు లోపలకు పోయి కనుగుడ్లమీద తడిగుడ్డ కప్పినట్లుగా జారి వున్నాయి.

నన్ను చూస్తూనే పేలవంగా నవ్వింది.

"దేనికి రమ్మన్నారట?"

"ఎంత అసహ్యకరమైన విషయాన్నయినా మనిషి భరించగలిగే గుండెనిబ్బరం వుండాలి. అందునా మగవాడికి. ఏదో నేను అవాకులు, చెవాకులూ పేలానని రోడ్డు మీద విడిచిన గుడ్డల మూటను విసిరేసినట్లుగా విసిరేసి వెళ్ళి పోయారే, అది బాగున్నదా మీకు?"

"అందంగా వున్నాయి కదా అని కోడె దూడల్ని, నాగుపాముల్ని నట్టింట్లో తెచ్చి పెట్టుకోలేం గదా!"

"నేను ఆడపిల్లనండీ. ఇంకా దేవుడు కేటాయించిన వందేళ్ళలో నాలుగో వంతుకూడా ఖర్చుకాని సుకుమారిని" రోషంగా అన్నది.

నాకు కోపంలోనుంచే ఆమె మాటలకు నవ్వు పుట్టుకు వచ్చింది.

"ఎందుకు ఈ మాటలన్నీ... నన్ను పిలిపించిన కారణం చెబితే విని వెళతాను. ఇంతకీ డబ్బేమైనా కావాలా?" ఎంత నిగ్రహించుకున్నా నా మాటల్లో శ్లేష ఆగలేదు.

"ఊరికే తీసుకునే అలవాటు నాకు లేదు!" తల వంచుకుంటూ అన్నది సరోజ.

"ఛండాలపు పనులకు డబ్బు వెచ్చించటం నాకూ ఇష్టం లేదు!" తుపాకీ గుండులా వదిలిన నా మాటలు ఆమె శరీరాన్ని తూట్లు తూట్లుగా పొడిచినట్లుగా ఆమె విలవిలలాడడం నాకు స్పష్టంగా కనబడింది. ఆమె ముఖం తెల్లగా పాలిపోయింది.

ఆమె ఎర్రని, సన్నని క్రింద పెదవి సడలిన లేత ఆకులా క్రిందకు జారింది. ఆమె చూపుల్ని చూస్తుంటే జాలి వేసింది. కానీ ఆలాంటి హీనాతి హీనచరిత్రురాలి మీద నాకు కరుణ, దయ ఏమిటి?

"నేను ఇలా అవడానికి కారణం ఎవరంటారు?" చేతకాని అసహాయతనుండి పుట్టుకొచ్చిన ప్రశ్నలా వున్నది అది.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ చప్పట్లు కొట్టి, "ఏ చేతిది తప్పంటాము?" అన్నాను ఎగతాళిగా.

"నిజమే. నా తప్పులేదని నేననను. కానీ నేను ఇలా అవడానికి కారణమయిన ఆ బాస్టర్డ్ గురించి తెలుసుకోవాలని మీకు లేదా?"

"దాని వలన నేను పొందే లాభం?"

"ఓ అర్భకురాలయిన ఆడకూతురంటే జాలి!"

"ఆ జాలి నాకు ఆనందాన్ని కలిగిస్తుందా?"

"ఉఁహూఁ... కానీ మీలోని ద్వేషాన్ని చిన్నగానైనా కరిగించుకోగలుగుతారు గదా?"

"నాకు ఎవ్వరి మీదా కోపం లేదు. ద్వేషం లేదు. నాకు ఎందుకు చెబుతారు ఇవన్నీ... ఆఫ్ట్రాల్ ఒకే వీధిలో ఎదురెదురుగా వున్న ఇళ్ళల్లో వుంటున్న వాళ్ళం. ఈ రోజు వున్న వాళ్ళం రేపు వుంటామనే గ్యారంటీ లేదు. ఏ కారణంతోనైనా మారిపోవచ్చు."

చటుక్కున ఆమె లేచి నిలబడింది. "ఫర్ గాడ్ సేక్...మీరు ఇక్కడనుంచి వెళ్ళిపోవద్దు."

"కారణం?" ఓ అడుగు వెనక్కు వేశాను.

"తుఫానులో చిక్కుకుని అస్తవ్యస్తమయిపోతున్న నా మనస్సుకు మీరు శాంతిని ప్రసాదించగలరు కనుక!"

"నాన్సెన్స్. నేనెవరు? మీరెవరు? ఏ విధంగా మీకు శాంతి లభిస్తుంది?"

"నేను ఇలా అవడానికి కారణమయిన ఆ ఛండాలుని సర్వనాశనం చేసేటంత వరకూ మీరు సాయం చేస్తారనే నమ్మకం నాకున్నది కనుక!"

⁂ ⁂ ⁂

ముసలమ్మ రెండు కప్పులతో కాఫీ తెచ్చి మా మధ్య వున్న టీపాయ్ మీద పెట్టింది.

అప్పుడు, సాయంత్రం అయిదు గంటలయింది.

ఆరోజు 'మళ్ళీ తరువాత కలుస్తాను' అని చెప్పి ఆ మేడమీద నుంచి విసురుగా బయటకు వచ్చేసిన తరువాత మూడు రోజులు దీర్ఘంగా ఆలోచించాను. నేను ఏ విధంగా ఆమెకు సాయం చేయగలను అని!

ఒక పక్క మనస్సు పీకుతునేవుంది. అనవసరంగా ఈ రొంపిలో నేను ఇరుక్కుంటున్నాను అని. మంచి మనుష్యులతో ఏం చేసినా మనకు అపకీర్తి రాదు. సరోజలాంటి స్త్రీల వ్యవహారాలల్లో తల దూర్చటం అంటే నా గౌరవాన్ని బజార్లో నిలబెట్టినట్టే!

మనస్సంతా కలత బారుతున్నది. అమెను గురించి ఆలోచిస్తుంటే నీరసం ఆవరిస్తున్నది. సంపెంగ పూల వెనుక దాక్కున్న నాగుబాములా వున్న ఆమె ప్రవర్తన నన్ను కాటు వేస్తే?

నేను ఊహించలేని పరిస్థితి అది. అయినా అందమైన అజంతా శిల్పంలాంటి ఆమె క్రుంగి కృశించి పోతుంటే నా మనస్సు నిశ్శబ్దంగా ఊరుకోలేకపోతోంది.

అమె కాలిపోతున్న జీవితాన్ని చూస్తూ అసహాయంగా వుండిపోలేనేమో అనిపిస్తోంది.

కర్కశమైన మొరటు పాదాల క్రింద తొక్కివేయబడుతున్న ఆమెను నలుగురి నడుమా మమత, ప్రేమ, మానవత్వం పొందే మనిషిగా చేయలేనా? సభ్య సమాజంలో ఆ అందమైన బొమ్మకు ఒక ఉన్నత స్థానాన్ని ఏర్పరచలేనా?

నాలో ఏర్పడుతున్న ఈ సంఘర్షణకు సమాధానం అన్నట్లుగా నేను తిరిగి ఆమేడ మెట్లెక్కాను చిరుజల్లులో తడుస్తూ. సరోజ ముందు కూర్చున్నాను.

వేడి పొగలు క్రక్కుతున్న కాఫీని చప్పరిస్తున్నప్పుడు వాకిట్లో చిరుజల్లు కాస్తా జడివాన అయింది.

"ఓ త్రాష్టుడి అమాయకమైన చూపుల వలలో చిక్కుకొని మోసపోయాను!"

"ఎవరతను?"

"రమేష్ అని నాతో కలసి చదువుకున్నాడు. సంస్కారం ఉట్టిపడేలా ప్రవర్తించి నన్ను, నా మనసును, తనవైపు లాక్కొని, నన్ను ఆక్రమించి, పెద్దలు తెచ్చిన ఓ ధనవంతుడి కూతురి డబ్బు మోజులో పడి, ఆమె మెళ్ళో మూడు ముళ్ళూ వేసి, నన్ను సర్వనాశనం చేశాడు!"

"మీరూ తొందరపడ్డట్టు కాదా?"

"నేను చెప్పాను గదా... నా తప్పూ వున్నదని. అతడి మాటలు నమ్మి ఇంట్లోనుంచి అర్ధరాత్రి కట్టుబట్టలతో పారిపోయాను. తరువాత డెభై రెండు గంటలలోనే నేను మోసగించబడ్డానని తెలుసుకున్నప్పుడు నా బ్రతుకే నాకు బరువయింది. నా జీవితమే నాకు అసహ్యమేసింది."

"మరి ఏం చేశారు అప్పుడు?"

"ఏమీ చేతకాక మరల అర్ధరాత్రి మా ఇంటి వాకిట్లో కాలు పెట్టాను తలవంచుకొని!"

నేను మాట్లాడలేకపోయాను.

ఆ రోజున ఆ క్షణాన ఆమెను ఓదార్చే ఓర్పు ఆమె తల్లిదండ్రులకు లేకపోయిందని నాకు అర్ధమయింది.

"నన్ను బిచ్చగత్తెకంటే హీనంగా తరిమికొట్టారు నన్ను కన్న తల్లిదండ్రులు. అప్పుడే ఒక నిర్ణయానికి వచ్చేశాను!"

"ఇలా బ్రతకాలనా?" ఎంత నిగ్రహించుకున్నా నా కంఠంలో, నా మాటల్లో ఎగతాళి బహిర్గతం కాకుండా ఆగలేకపోయింది.

"అవును!" ఆమె కంఠం [illegible] గంభీరంగా వున్నది. "ఎందుకో తెలుసా?"

"చెప్పండి."

"సరైన సంపాదన లేని మా నాన్న, ఇంకేం పనిలేనట్లుగా సంవత్సరానికోసారి మా అమ్మను మరో బిడ్డకు తల్లిని చేస్తూ, మా కుటుంబాన్ని అధఃపాతాళానికి నెట్టివేశాడు. మాకు కట్టుకోవడానికి సరైన గుడ్డలులేవు. కడుపు నిండా భోజనానికి కూడా మొహం వాచిపోయేలా ఏడ్చేవాళ్ళం. అలాంటి బ్రతుకులు ఈడుస్తూనే, నేను ట్యూషన్లు చెప్పి డబ్బు సంపాదించుకుని ప్రైవేటుగా ఎమ్మే పాసయ్యాను. ఎమ్మే పాసయి ఆ భ్రష్టుడి వలలో పడి నా తెలివిని, భవిష్యత్తును గంగలో కలిపేశాను!" ఆమె దుఃఖాన్ని ఆపుకోలేనట్లుగా గొంతు బొంగురుపోయింది.

"ఒక్కోసారి చిన్న సంఘటన కూడా జీవితాన్ని అస్తవ్యస్తం చేసేస్తుంది!" సానుభూతిగా అన్నాను.

ఆమె ముఖం ఎర్రబడసాగింది. ఆమె పిడికిళ్ళు బిగుసుకుంటున్నాయి. ఆమె ఊపిరి బిగపట్టుకుంటున్నట్లు రెప్ప లార్పకుండా కనుగుడ్లను సూదుల్లా పెట్టి ముందుకు చూస్తోంది. క్షణంలో ఆమె ముఖం రక్తపు ముద్దలా అయింది. ఆమె కళ్ళు అగ్నిగోళాలయ్యాయి. ఆమె ఆవేశంతో ఊగిపోతూ నరాలు ఉబ్బిన పిడికిళ్ళను సోఫా మీద కొడుతూ, "సంపాదిస్తాను... డబ్బు సంపాదిస్తాను. కోరినంత డబ్బు సంపాదిస్తాను. ఈ వెధవలను నా చుట్టూ ఆటబొమ్మల్లా తిప్పుకుంటాను. నా ఇంటి ముందు, నోళ్ళు తెరుచుకొని నా చూపుల కోసం పడిగాపులు పడివుండేలా నా అందాన్ని వలలా విసిరి వాళ్ళను సర్వనాశనం చేస్తాను. వాళ్ళ సమాధుల మీదగా పైకి లేస్తూ నన్ను నేను నిలబెట్టుకొని నా తరువాత అమ్మ కడుపున పుట్టిన ఆరుగురికీ అందమైన జీవితాన్ని ప్రసాదిస్తాను!" అరుస్తున్నట్లుగా అన్నది.

మొట్టమొదటి సారిగా సరోజ వంక క్షణం జాలిగా చూశాను- ఆమె కొవ్వొత్తి అవుతున్నందుకు.

"అదే- మరోసారి మా ఇంటి గడప ఇవతలగా నిలబడి మా నాన్నకు చెప్పినప్పుడు ఆయన ఒక్కక్షణం గూడా ఆలస్యం చేయకుండా, 'మంచి ఆలోచన' అంటూ నన్ను లోపలకు ఆహ్వానించాడు. అంతేగాదు నన్ను మా ఊరినుంచి మాకు తెలిసిన వాళ్ళందరికీ దూరంగా ఇక్కడకు తీసుకు వచ్చి ఈ మహాపట్టణంలో దింపి నేనేదో గౌరవప్రదమైన బ్రతుకుతో డబ్బు సంపాదిస్తున్నట్లుగా మా ఊరివారి ముందు గొప్పలు చెప్పుకుంటున్నాడు!" ఆమె కంటి వెంట నీరు ధారగా కారుతున్నది.

ఆమె చటుక్కున లేచి నిలబడింది.

"ఐ హేట్ దట్ బగ్గర్... ఐ వాంట్ టు కిల్ దట్ బాస్టర్డ్!"

ఆమె శరీరంలోని నరాలన్నీ ఫట్‌మని తెగేలా ఊగిపోతున్నది.

"నేను పనికిరాను... నా రక్తం మాత్రం వాళ్ళకు తిండిపెట్టాలి!"

✢ ✢ ✢

ఉదయాన్నే ఎదురింటి మేడమీద భాగంలో నుంచి పెద్ద పెద్ద కేకలు వినబడుతుండగా కిటికీలోనుండి అటువైపు చూశాను.

ఆ అరుపులన్నీ వాళ్ళ బెడ్ రూంలోనుండే- సరోజకు డబ్బులిచ్చి కొన్ని గంటలు ఆమెను కొనుక్కున్న మనిషి అరుపులు కాదుగదా?

ఎంతో వేదనతో అటే చూస్తూ వుండిపోయాను చాలాసేపు నిశ్శబ్దంగా.

తరువాత పావుగంటకు ఆ శబ్దాలు ఆగిపోయినయి. ఓ ముసలాయన బయటకు వచ్చాడు చేతిలో చిన్న గుడ్డ సంచీతో.

మేడమెట్లు దిగి గేటు దగ్గర నిలబెట్టివున్న ఆటో ఎక్కాడు. అతడు ఎక్కటం ఆలస్యం ఆటో వెళ్ళిపోయింది.

నాకు అప్పుడు గుర్తుకు వచ్చింది ఆయన ఎవరో... సరోజ తండ్రి. సరోజ అసహ్యించుకొని ద్వేషించే కన్నతండ్రి.

సాయంత్రం ఆఫీసునుండి వస్తూ మా వీధి మొదట్లో వున్న జనరల్ స్టోర్స్ నుంచి ఫోను చేస్తున్న సరోజను చూసి ఆగాను. ఆమె ఫోను పెట్టేసి డబ్బులిచ్చి రాగానే ఆమెతో అడుగులు కలిపాను.

నన్ను చూచి ఆమె తడబడింది.

నాకు అర్థమయింది, ఆమె తడబాటుకు కారణం. ఆమె ఫోనుచేసి కనుక్కున్నది 'ఏ హోటల్‌కి, ఎన్ని గంటలకు, ఏ రూంకి రావాలి' అని.

అమె కళ్ళు వాలిపోయాయి నా ఖేదమయిన నవ్వును చూసి.

"మీ నాన్న వచ్చినట్లున్నాడు?"

ఆమె ఉలిక్కిపడ్డట్లుగా తలెత్తింది. ఆమె పెదవులు అల్లల్లాడినాయి 'అవును' అన్నట్లుగా.

"డబ్బు కోసమా?" నాకు అర్థమయిన అతడి అరుపుల్లోని అర్థాన్ని మాటల రూపంలో పెట్టాను.

నిజమేనన్నట్లుగా ఆమె మౌనం.

"ఇచ్చిన డబ్బు చాలట్లేదటనా?"

"అందుకే నానా గొడవా చేసి వెళ్ళాడు" ఆమె కళ్ళల్లోలాగానే కంఠంగూడా తడుస్తున్నదని స్పష్టమయింది నాకు.

"ఏమిటి మీ మీద ఆయన అధారిటీ?"

"నన్ను ఆయన కూతురిగా ఈ భూమ్మీద బ్రతకనిస్తున్నందుకు!"

"నాన్సెన్స్... మీరు బయటకు వచ్చేసిన తరువాత వాళ్ళకూ మీకూ సంబంధం ఏమున్నది? ఒకసారి ఆ యింటి నుంచి మీరు వెళ్ళగొట్టబడ్డారనే విషయాన్ని మరిచి పోయారా?..."

"కానీ తిరిగి మళ్ళీ వెళ్ళాను గదా!"

"దేనికి? దేనికి వెళ్ళారు? తిండికి గతిలేక అల్లల్లాడుతున్న ఆ కుటుంబాన్ని ఆదుకుంటానని వెళ్ళారు. సాయం చేస్తానని వెళ్ళారు. అటువంటి మిమ్మల్ని చూచి సంతోషించాల్సింది పోయి దౌర్జన్యం ఎందుకు చేయాలి?"

బరువుగా పడుతున్న అడుగుల నడుమ నిశ్శబ్దం... ఆమె మాట్లాడలేకపోతున్నట్లుగా ఆగిపోయింది.

"చూడండి. మా అమ్మ మీద, నా తరువాత పుట్టిన తమ్ముళ్ళ మీద, చెల్లెళ్ళ మీద జాలితో, వాళ్ళ దౌర్భాగ్యాన్ని చూడలేక, ఎట్లాగూ నాశనమయ్యాను గదా అని వాళ్ళకేదో చేద్దామని ఆశపడ్డాను. కానీ ఆ రాక్షసుడు నా సహాయాన్ని వాళ్ళ జన్మహక్కులా భావిస్తున్నాడు!" ఆమె వేదనాభరిత కంఠం ఆమెకే కాదు, ఆమె మాటల్ని వినే వాళ్ళను గూడా కృంగదీస్తోంది.

"ఈసారి ఇంట్లో కాలు పెడితే మర్యాదగా వుండదని చెప్పండి!" కోపంగా అన్నాను.

సరోజ నవ్వింది చాలా చిన్నగా. "నిజమే. దాని ఫలితం అనుభవించేది ఎవ్వరు? ప్రేమ, అభిమానం అనే పేగులు నన్ను వాళ్ళతో బంధించివేసినాయి. వాటిని తెంపివేయటం బహు తేలిక. తరువాత మళ్ళా మామూలే. అందుకే ఆ మూర్ఖుడు నాలోని ఆ పేగులతో ఆడుకుంటున్నాడు!" ఆమె గుండెల్లోనుండి వెలువడుతున్న బాధ నన్ను వివశుణ్ణి చేస్తోంది.

ఇంటిదాకా మౌనంగా నడిచాం.

ఆమె ఇంట్లోకి వెళ్ళబోతున్నప్పుడు, "బాధపడబోకండి. మీ సమస్యకు ఏదైనా గౌరవప్రదమైన పరిష్కారం దొరుకుతుందేమో ప్రయత్నిస్తున్నాను. త్వరలోనే నా ఆలోచనలు ఓ దరికి రావచ్చు. అప్పుడు వస్తాను మీ దగ్గరకు!" నేను వడివడిగా ముందుకు అడుగులు వేశాను. 'మీరు ఇలా జీవంలేని బొమ్మలా అందరి చేతుల్లోనూ ఆడడం నాకు ఇష్టంలేదు' ఆమెకు వినబడీ వినబడకుండా గొణుక్కున్నాను.

❖ ❖ ❖

ఆదివారం.

వడివడిగా మెట్లెక్కాను మా ఇంటి ఎదురు మేడ మీదకు.

నాకు చాలా ఆనందంగా వుంది. రామం చేసిన ప్రయత్నం ఫలించింది.

ఓ కంపెనీ ఎమ్‌డీతో మాట్లాడాడట. ఆయన సరోజను పంపమన్నాడట. అక్కడ గౌరవప్రదమైన జీతమూ, జీవితమూ గూడా వుంటాయని చెప్పాడు.

అయితే వాడి అనుమానాలు వాడివి. "అసలు ఆ రొచ్చులోకి దిగనేకూడదు. ఒకసారి దిగిన తరువాత జీవితాన్ని సాఫీగా నడపడం కష్టమే అవవచ్చు. సరే అయినా నీ ప్రయత్నాన్ని నేనెందుకు కాదనాలి. చూద్దాం. బాగుపడితే ఆ అమ్మాయి అదృష్టం. కాదూ ఆ అమ్మాయి ఖర్మ!"

ఎండ మండిపోతున్నది. సంశయిస్తూనే దగ్గరకు వేసి వున్న తలుపు నెట్టాను. ఎదురుగ్గా సోఫాలో ముసలమ్మ కూర్చొని వున్నది. నన్ను చూస్తూనే లేచి, "కాసేపుండి రాకూడదూ. ఎవరో స్నేహితులతో మాట్లాడుతున్నది!" అన్నది తలవంచుకొని.

నాకు అర్ధమయింది. ఒక్క క్షణం అక్కడ వుండ బుద్ధి కాలేదు. మెట్లెక్కినంత వడివడిగానే దిగి నా గదిలోకి వచ్చేశాను.

నాకు చాలా అసహ్యమేసింది.

ఆ స్నేహితుడు అనబడే వ్యక్తి ఆమెకు డబ్బులిచ్చి ఆ క్షణాన ఆమె రక్తాన్ని త్రాగేస్తున్నాడు.

ఛ!ఛ!... ఎలాంటి మనిషితో నేను వ్యవహారాన్ని పెట్టుకున్నాను. ఎర్రటి రక్తమంటే ఎంత జుగుప్సో ఆ మేడ మెట్లెక్కాలన్నా అంతే జుగుప్సగా వుంది.

కొన్ని గంటల వరకూ కోలుకోలేకపోయాను. సాయంత్రానికిగాని మరల దృఢ చిత్తుడను కాలేకపోయాను.

ఎన్ని మబ్బులయినా ఆకాశపు స్వచ్ఛతను కలుషితం చేయలేకపోవచ్చు- తాత్కాలికంగా అడ్డుపడి అశాంతిని కలిగించడమే తప్ప!

ఆలాగే నా మనస్సులోని ఆమెను సరైన దారిలో పెట్టాలనే దృఢ నిశ్చయాన్ని ఈ చిన్నచిన్న సంఘటనలు సడలించలేకపోవచ్చు, మనస్సుకు కొంతసేపు అస్థిరతను చేకూర్చడం తప్ప.

మరల సరోజ ఇంటి మేడమెట్లు ఎక్కాలంటే మనస్సు ఎదురు తిరుగుతోంది. కానీ అనుకున్న కార్యం సాధించాలీ అంటే ఆ మాత్రపు ఘర్షణ తప్పదు. అందునా ఇలాంటి విషయాలల్లో.

సరిగ్గా అటువంటి సమయంలోనే సరోజ ఇంట్లో ఉన్న ముసలమ్మ వచ్చి నా ఎదురుగా నిలబడింది.

అప్పుడు సాయంత్రం ఆరు దాటివుంటుంది. ఆఫీసునుంచి వచ్చి గంటయింది. స్నానంచేసి కూర్చొని ఆలోచనల వలయం ఇదమిద్ధంగా తీసుకోలేని నిర్ణయాల సుడులలో తిరుగుతున్న సమయం అది.

"మిమ్మల్ని రమ్మంటున్నది అమ్మాయి."

"స్నేహితులు ఎవరూ లేరా?" నా కంఠం నాకే చాలా కరుకుగా వున్నట్లనిపించింది.

ఆమె తల వంచుకునే ఎవరూ లేరన్నట్లుగా తల ఊపింది.

"వస్తాను పద" అని ఆమెను పంపేసి రామం చెప్పిన వివరాలున్న కాగితాన్ని తీసుకొని తరువాత పది నిముషాలల్లోనే సరోజ ముందు నిలుచున్నాను.

నన్ను చూస్తూనే ఆమె పరుగెడుతున్నట్లుగా ముందుకు వచ్చి సంతోషంతో ముఖమంతా విశాలం చేసుకొని, "నా దగ్గర ఓ మంచి వార్త వున్నది!" అన్నది.

"ఏమిటది?"

"రమేష్ కనబడ్డాడు!"

"రమేష్ ఎవరు?" నాకు అర్థం కాలేదు. అదే ప్రశ్నించాను.

ఒక్క క్షణం ఆగింది. ఆ ఒక్క క్షణంలోనే ఆమె ముఖమంతా ఎర్రబడింది. లోపల నీరు సలసలా కాగి ఆవిరై చర్మం మీద బుడగలు తేలినట్లుగా ముఖమంతా నీటి బిందువులు ఉబ్బినాయి. "చెప్పాను గదా. నా ఈనాటి ఈ స్థితికి కారకుడు" ఆమె సన్నని కంఠం గుడ్లగూబ కంఠంలా కీచుమంటోంది.

నాకు కోపం గుండెల్లోనుండి జర్రున పైకి ఎగతన్నింది.

"మీరు నాకొక్కటి చెప్పాలి. మీ ముసలమ్మ మాటల్లోలా ఇంకా స్నేహితులతో తిరగాలనే మీరు కోరుకుంటున్నట్లయితే నేను నా కాలాన్ని, శ్రమనీ, వృధా చేయడం అనవసరం. లేదూ, మీరు సభ్య సమాజంలోకి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటే నేను

ఎంత శ్రమయినా పడతాను!" చాలా నిష్కర్షగా చెప్పాను. "మీరు పయనిద్దామనుకుంటున్న దారి ఏదో మీరు నిర్ణయించుకోండి. ఇలాంటి విషయాలల్లో మీకు మరొకరు సలహాలు ఇవ్వగలరే గాని... బలవంతంగా మీ నెత్తిన రుద్దలేరు!"

కొన్ని క్షణాల నిశ్శబ్దం. ఆమె తట్టుకోలేనట్లుగా కలవరపడుతున్న వదనంతో, నా కళ్ళల్లోకే సూటిగా చూస్తూ, రెండు చేతులూ జోడించి, "నాలో రగులుతున్న మంటల్ని ఆర్పవద్దు. నన్ను మాట్లాడనివ్వండి" అన్నది నీరసంగా.

ఆమెను చూస్తూ నేను మాట్లాడలేకపోయాను.

నేను ఎంతో ఉత్సాహంగా వచ్చాను. రామం ఏర్పాటు చేసిన ఉద్యోగం గురించి ఆమెకు చెప్పడానికి. కానీ రెండు సార్లూ చికాకు కలిగించే పరిస్థితులే. అసహనంగా అటూ యిటూ కదులుతూ, "రమేష్ కనబడితే ఏమైంది?" అన్నాను త్వరగా ఆ విషయానికి తెర దించేయాలి అన్నట్లుగా.

"సరోజ అంటే ఏమిటో చూపిస్తాను!" అన్నది గంయ్‌మని లేస్తూ కొత్త ఊపిరి తీసుకుంటున్నట్లుగా.

"ఏం చేస్తావ్ అతడిని? నువ్వేం చేయలేవు!" ఈసడింపుగా అన్నాను.

"నరికి పోగులు పెడతాను!" ఆ క్షణాన ఆమె కళ్ళు అగ్నిగోళాల్లా వున్నాయి.

నేను హేలగా నవ్వాను. "అంటే ఇంకొక ఆడదాని తాడు తెంచుతావన్నమాట!"

ఒక్కసారిగా సరోజ ముఖం తెల్లగా పాలిపోయింది. కాని అది ఒక్క క్షణమే. తిరిగి మొహంలో నెత్తురు విరజిమ్మింది.

"నన్ను సెంటిమెంట్లతో ఓడించవద్దు. పోరాటం నాకూ ఆ రాస్కెల్‌కీ నడుమ. మూడోవాళ్ళు నాకు కనబడరు!"

"నువ్వే చెప్పావ్. అతడు ధనవంతుడు, బలవంతుడు అని. సంఘంలో ఆ ధనమే అతడిని చాలా ఉన్నతస్థానంలో నిలబెడుతుంది. అతడు చేసే ఎలాంటి తప్పుడు పనినైనా అందరి దృష్టిలో ఘనంగా కనబడేలా చేస్తుంది!..." ఒక్క క్షణం ఆగాను ఆమె ముఖంలోకే తదేకంగా చూస్తూ, ఆమె మీద నా మాటల ప్రభావం ఎలా వున్నదీ అన్నట్లుగా. "అతడి ముందు నువ్వొక గడ్డిపోచలాంటి దానివి. కనుక మేడమ్... ఊరికినే గాలిలోపడి కొట్టుకుపోయి, నీ అస్థిత్వాన్ని కోల్పోయే దానికంటే మంచి అవకాశం వచ్చింది. వెర్రి ఆలోచనలు మాని నేను చెప్పిన పని చేయి. నువ్వు సమాజంలో గౌరవప్రదంగా బ్రతకడమే

కాకుండా నువ్వు కోరుకుంటున్నట్లుగా నీ తమ్ముళ్ళనూ, చెల్లెళ్ళనూ ఉద్ధరించను కూడావచ్చు. అలాచేయడం వలన వాళ్ళు నిన్నుచూసి గర్వపడతారే తప్ప నిన్ను ఈసడించుకోవాల్సిన స్థితిలో వుండరు!"

ఆమె నా మాటలకు నీరసంతో క్రుంగిపోతున్నట్లుగా, "అది నావల్ల అవుతుందా? మీరంటున్న ఈ సంఘం నన్ను గౌరవంగా బ్రతకనిస్తుందా? నా అందాన్ని నాకుగా వదిలేసి దూరదూరంగా తిరగగలుగుతుందా?" అన్నది చిన్నగా.

"ఛత్! అందమైన ఆడవాళ్ళ అందరి గతీ ఇంతేననా మీ ఉద్దేశ్యం?" ఈసడింపుగా అన్నాను.

ఆమె ముఖాన్ని చేతులతో కప్పుకున్నది. ఆమె గుండెల్లోంచి ఎగతన్నుకొస్తున్న దుఃఖాన్ని నిగ్రహించుకునేందుకు ప్రయత్నిస్తోంది.

ఆమె విసురుగా లేచి నిలబడి తలుపు లోపల ఘడియవేసి నాకు దగ్గరగా వస్తూ కలవరపడుతున్న నాకు అతి సమీపంగా నిలబడి చటుక్కున చీరను మోకాలు పైవరకూ ఎత్తింది.

నేను ముఖం పక్కకు తిప్పుకుంటూ, "ఏమిటది?" విసురుగా అన్నాను.

"ఇక్కడ సిగ్గుపడాల్సిందేమీ లేదు మాస్టారూ! జరిగిన ఘోరాన్ని ఈ తొడ మీద కాలిన మచ్చ మీకు చూపిస్తోంది. ఈ రాక్షసి, ఆ ఛండాలుడూ కలసి నేను వాళ్ళు అనుకున్నంతగా డబ్బు సంపాదించనందుకు పెట్టిన వాత ఇది!" చాలా చిన్నగా దుఃఖంతో తడిసిన మాటలను ముద్దముద్దగా నా ముందు వెళ్ళగక్కింది.

నేను కలవరపడుతూ లేచి నిలబడ్డాను.

"అవును దీని సాక్షిగా!" చీర క్రిందకు జారుస్తూ అన్నది. "ఈ ముసల్ది ఆయన తరఫున నాకు కాపలాగా ఉంచబడిన మనిషి!"

"పోలీసులను పిలవనా?" ముక్కుపుటాలు కోపంతో అదురుతుండగా అన్నాను.

"ఫలితం? నా అందమే నాకు శాపమైనప్పుడు నేను ఈ తోడేళ్ళను ఎన్నాళ్ళు ఎలా తప్పించుకుని బ్రతకగలను? నాకు చావు ఒక్కటే రక్ష అని నాకు తెలుసు. కానీ చావను. ఎందుకంటే నేను ఇలాంటి నికృష్టపు పక్షులనన్నిటినీ ఒక ఆట ఆడిద్దామనే కృతనిశ్చయంతో ఉన్నాను గనుక. ఈ కుళ్ళు వ్యవస్థను ప్రక్షాళితం చేయాలనే తపనలో ఉన్నాను గనుక!"

✣ ✣ ✣

"మీరు ఇచ్చిన అడ్రస్‌కు వెళ్ళాను ఆయన్ను కలుద్దామని. ఆయన ఢిల్లీ వెళ్ళారట అనుకోకుండా ఏదో అర్జంట్ పని మీద ఉదయం ఫ్లయిట్‌కి. నాలుగు రోజుల తరువాతగానీ ఆయన రాకపోవచ్చు."

ఆమె మాటల్లోని నిరాశ, నా గుండెల్లో నిరుత్సాహాన్ని కలిగించింది.

"మీరు నాగురించి, నా బాగు గురించి తాపత్రయ పడుతున్నప్పుడు నేనెందుకు సహకరించగూడదని వెళ్ళాను. కానీ ఇవి నా జీవితానికి సరిపడేవి కావు. ఇలాంటివి నాకు కలిసొచ్చేవైతే నా జీవితం ఇంత ఛండాలపు మలుపు తిరిగేదే కాదు" అన్నది పేలవంగా నవ్వుతూ.

ఆరోజు సాయంత్రం ఆరుగంటలకు నేను ఆఫీసునుంచి వస్తూనే ఆ విషయం కనుక్కుందామని ఆ మేడ మెట్లెక్కాను.

ఆ సమయంలో ఆమె స్నేహితులెవ్వరూ లేకపోవడం నాకెందుకో శుభసూచకంగా కనిపించింది.

కానీ జరిగింది వేరు.

ఆమె మాటలకు నాకు జాలివేసింది. నిజమే. కొందరి జీవితాలు అలాగే ఉంటాయి. కొందరు ఏం పట్టుకున్నా బంగారమవుతుంది. కొందరికి బంగారం పట్టుకున్నా బూడిదయి కూర్చుంటుంది.

లోపలకు వెళ్ళి కాఫీ కలుపుకు తీసుకు వచ్చి నా చేతికిచ్చి సోఫాలో కూర్చుంది. ఆమె ఎదురుగా తల వంచుకు కాఫీ త్రాగుతూ నిశ్శబ్దంగా కూర్చున్నాను. మాట్లాడేటందుకు ఇంకేమున్నది?

"మీరు మా ఇంటికి ఎంత తక్కువగా వస్తే అంత మంచిది. మీ ఆఫీసు ఫోను నంబరు ఇవ్వండి. నేనే మాట్లాడతాను అవసరమొస్తే!" లోగొంతుకతో చాలా చిన్నగా అన్నది సిగ్గుపడుతున్నట్లుగా తలవంచుకొని.

నేను ఉలిక్కిపడ్డట్లుగా తలెత్తి ఆమె ముఖంలోకి చూశాను.

"నేను చాలా చెడ్డదాన్నని పేరు వచ్చింది. అలాంటి పేరు మీరుకూడా ఎందుకు తెచ్చుకుంటారు?"

ఆమె భావం అర్థమయినప్పుడు నేను నిర్లక్ష్యంగా లోపలకు వచ్చిన ద్వారం వైపుకే చూస్తూ వుండిపోయాను. అక్కడో మనిషి వున్నట్లుగా క్రీనీడ, ఆపైన చిన్నగా కదులుతున్న కర్టెను.

ఆమె మాటలకంటే ఆ పరిసరాలే నాకు కాస్త భయం కలిగించినాయి.

సరోజ మాటలు నాకు సలహా ఇస్తున్నట్లుగా అనిపించలేదు. హెచ్చరికలాగానే ఉన్నది. దాని ఫలితమేమిటో తరువాత మూడో రోజు ఉదయాన్నే తెలిసి వచ్చింది నాకు.

ఆఫీసుకు వెళదామని తయారవుతున్నాను. స్నానం అయింది. డ్రెస్సు చేసుకొని బూట్లు వేసుకోవటానికి మేజోళ్ళు తొడుక్కుంటున్నాను.

అప్పుడు ఆయన తలుపు తోసుకుంటూ లోపలకు వచ్చి, "నేను రెండు మంచి మాటలు చెప్పి వెళ్దామనివచ్చాను. వినడానికి మీకేం అభ్యంతరంలేదుకదా!" కీచుగొంతుకను ఎగతాళిలో రంగరించి వదిలినట్లుగా వున్నాయి ఆ మాటలు.

అంత దగ్గరనుంచి ఆ మనిషిని ఎప్పుడూ చూడకపోవడంతో కాస్త తడబడ్డాను.

"మీరెవరు?" అన్నాను కుర్చీలోంచి లేచి నిలుచుంటూ.

"నేను మీ ఎదురింటి మేడమీద సరోజ తండ్రిని... ఏమిటీ మా అమ్మాయికి మీరేదో ఉద్యోగం చూస్తున్నారట. మీకు కాని విషయాలలో్ మీరు కల్పించుకోవడం మీ వంటికి అంత మంచిదికాదని చెప్పడానికే వచ్చాను!" సూటిగా అసలు విషయంలోకి వస్తూ అన్నాడు.

"అంటే?" అతడి మాటలు లెక్క చేయడం ఇష్టం లేదన్నట్లుగా విసురుగా అన్నాను.

"నేను ఎవ్వరికయినా అర్థమయ్యేలా చెప్పడమంటే చాలా ఘోరాలే జరిగిపోతాయి. వద్దు... చెప్పింది విను. సరోజతో ఇంకెప్పుడూ మాట్లాడటానికి ప్రయత్నించబోకు. సరోజను ఏదో ఉద్ధరిద్దామన్నట్లుగా తాపత్రయపడబోకు. నేను చాలా మంచివాడిని. నీలాగా మరొకరి విషయాల్లో ఎప్పుడూ కల్పించుకోను. వస్తాను!"

అతడు వచ్చినంత వేగంగానే నా ఇంటి గడప దాటాడు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తూ.

కానీ మరుక్షణంలోనే తిరిగి నా ఎదుట ప్రత్యక్షమయి, "మీరు అనుకుంటున్నట్లుగా అది ఉద్యోగం చేయాలీ అని అనుకోవాలేగానీ ఆ ఏర్పాట్లు చేయడం నాకు చిటిక వేసినంత తేలిక!" అంటూ చిటిక వేసుకుంటూ గేటు తీసుకొని వడివడిగా వెళ్ళిపోయాడు.

నాకు తల తిరిగిపోయింది. ఇదెక్కడి ఘోరం? నేను చేస్తున్నది చెడ్డపనా?

ఊబిలో ఇరుక్కుపోతున్న ఓ అభాగ్యురాలిని బయటకు లాగి నిలబెట్టాలనుకోవడం నేరమా? అందునా ఆ మాట చెబుతున్నది ఆ అమ్మాయి తండ్రా?

చికాకుతో గూడిన మనసుతో రోజంతా చాలా నీరసంగా గడిచిపోయింది.

ఆఫీసులో పనిమీద గూడా ధ్యాసను నిలపలేకపోయాను.

అసలు అతడు వచ్చి వెళ్ళిన షాక్‌నుండి కోలుకున్న తరువాత నిగ్రహించుకోలేని ఆవేశం వచ్చింది.

వెళ్ళి అతగాడి చొక్కా పట్టుకొని లోపలకి ఈడ్చుకువచ్చి తన్నాలన్నంత కోపం వచ్చింది. అయినా సభ్యత అడుగు ముందుకు వేయనీయలేదు. ఇక ఎట్టి పరిస్థితులలోనూ ఆ అమ్మాయి విషయంలో జోక్యం చేసుకోగూడదని అనుకున్నాను. చేసుకొని నలుగురిలో అభాసు అయ్యేదానికంటే చూస్తూ ఊరుకోవడం మేలనిపించింది.

ఎవరి ఖర్మకు ఎవరు బాధ్యులు?

సాయింత్రం ఆఫీసునుండి ఇంటికి వస్తూ కాఫీ త్రాగుదామని హోటల్‌కు వెళ్ళినప్పుడు టేబుల్‌ముందు ఒంటరిగా కూర్చున్న సరోజ కనబడింది.

నన్ను చూస్తూనే, "హాయ్" అంటూ చేయి ఊపింది.

పొద్దున జరిగిన సంఘటన వలన ఏర్పడిన నా మనస్సులోని బాధనంతా వెళ్ళగ్రక్కేందుకు మంచి అవకాశం దొరికినట్లుగా త్వరత్వరగా వెళ్ళి ఆమె ముందు కూర్చున్నాను.

"మీరు ఎప్పుడు కనబడతారా అని ఆత్రుతతో ఎదురు చూస్తున్నాను" అన్నాను.

"ముసలివాడి హేయమైన పనికి నన్ను నిలదీయాలనేది మీ ప్రయత్నమైతే నేను నిస్సహాయురాలిని!" బాధగా అన్నది. "నాకు తెలుసండీ. జరిగినదంతా నాకు తెలుసు. మీలో కుతకుతలాడుతున్న ఆవేశమూ నాకు తెలుసు" తల వంచుకొని అన్నది. "నేను ఎమ్మే సైకాలజీని!" నవ్వినా చాలా పేలవంగా వున్నదా నవ్వు. నాలోని ఆవేశాన్నంతా చల్లారుస్తూ నా నెత్తిన బిందెడు చన్నీళ్ళు కుమ్మరించింది.

"నేను చేసింది తప్పా?" నీరసించి పోయాను.

"కాక... మీకెందుకు వచ్చిన బాధండీ నా గురించి. తనకు కాని వాటిల్లో తల దూర్చడం అంటే కొరివితో తల గోక్కోవడం కాదా?"

నేను మాట్లాడలేకపోయాను.

జరిగిన దానికి ఎంతగానో బాధపడుతున్నట్లుగా ఆమె మాటలు ముద్దముద్దగా వస్తున్నాయి.

రెండు నిముషాలు మా మధ్య ఏ సంబంధమూ లేదన్నట్లుగా నిశ్శబ్దంగా గడిచి పోయింది.

బేరర్ వచ్చాడు.

"రెండు కాఫీ... స్ట్రాంగ్!" సరోజే చెప్పింది.

తిరిగి మౌనం... కాఫీ వచ్చేటంతవరకూ.

కప్పులు ముందుకు లాక్కొని కాఫీ త్రాగుతూ సరోజే మొదటిసారిగా నోరు విప్పింది.

"ఇప్పుడు రమేష్ వస్తున్నాడు ఇక్కడకు!" అన్నది కళ్ళు సగం ఎత్తి నా వైపు చూస్తూ. పెదవులు సాగదీస్తూ చిన్నగా నవ్వింది.

సూటిగా చూశాను ఆమె ముఖంలోకి. ఆ కళ్ళల్లో గాని, పడవలా పొడుగ్గా వంకర తిరిగివున్న ఆ కనురెప్పల్లోగాని నాకు ఎలాంటి అందమూ కనబడలేదు.

కొద్దిరోజుల క్రితం అందంగా గులాబీరెక్కల్లా కనిపించిన ఆమె పెదవులు తెల్లగా పాలిపోయి వున్నట్లనిపించింది ఆ క్షణాన నాకు.

అసలు ఆమె 'రమేష్ వస్తున్నాడు' అని చెబుతున్న తీరు చాలా అసహ్యంగా అనిపించింది.

డబ్బుకోసం ఎలాంటి హేయమైన పని చేయడానికైనా సిద్ధమే అన్నట్లుగా వున్నది ఆమె కంఠం. లేకపోతే తననీ, తన జీవితాన్నీ సర్వనాశనం చేసిన అతడితో ఆమెకేమిటి పని?

"ప్రస్తుతం మామగారి అండన ఓ పెద్ద కంపెనీకి డైరెక్టరయ్యాడు!" అన్నది మరోసారి నవ్వి.

ఆమెను, ఆమె నవ్వునూ చూస్తుంటే నాకు ఒళ్ళు గగుర్పొడిచింది. ఆ డిమ్‌లైట్ కాంతిలో ఓ విషనాగులా వుంది.

మాట్లాడుతున్నప్పుడు సన్నని ఆమె నాలుక పాము నాలికలా ముందుకూ వెనక్కు కదులుతున్నది.

"నేను మరో టేబుల్ దగ్గరకు వెళతాను!" చిరాగ్గా లేవబోతుండగా ఆమె వారిస్తూ, "అదేమిటి? అతడొస్తే మీ కేమిటి? ఉండండి. పరిచయం చేస్తాను!" అన్నది.

"నాకు అవసరం లేదు అతడి పరిచయం!"

"డబ్బున్న మనిషి ఎలా మాట్లాడతాడో తెలుసుకోవాలీ అంటే అతడితో ఓ పావుగంట గడపాలి, అదో థ్రిల్లు!" నవ్వింది కళ్ళు పెద్దవి చేసి చూస్తూ.

"ఆ మనిషి డబ్బులు కొల్లగొట్టే ప్రయత్నమా ఇది?" ఎగతాళిగా అన్నాను.

క్షణంలో ఆమె బిగుసుకుపోయింది.

సూటిగా నా ముఖంలోకే చూస్తూ చలనరహితంగా ఉండిపోయింది కొద్దిసేపు.

"కాదు!"

"మరి?"

కొత్త ఊపిరి పోసుకుంటున్నట్లుగా టేబుల్ మీద వున్న మంచినీళ్ల గ్లాసును తీసుకొని గడగడా త్రాగింది.

"రమేష్‌కు మరణదండన విధించబోతున్నాను!"

నేను ఆమె మాటల్ని చాలా తేలిగ్గా తీసుకుంటూ నవ్వాను.

"డబ్బు గుంజా?"

"బోడి డబ్బు... డబ్బే కావాలనుకుంటే కనుసైగ చేస్తే చాలు కట్టలు వచ్చి వాల్తాయి నా ముందు. దాని కోసం నన్ను నాశనం చేసిన అతడి చుట్టూ భజన చేస్తూ తిరగాలా?" విసురుగా అన్నది.

"అయితే ఏం చేద్దామని?"

"చూస్తారు కదా... నా తీర్పుకు తిరుగుండదు!" ఆమె కంఠం చాలా కరుకుగా వున్నది.

నాకు కొద్దిగా భయమేసింది ఆమెలోని తీక్షణతకు.

"చంపుతావా?" బెరుగ్గా ఆమెనే చూస్తూ అడిగాను.

తేలిగ్గా కుర్చీలో వెనక్కు వాలుతూ, "న్యాయమూర్తి దోషిని శిక్షిస్తాడా? ఉంహూం... శిక్ష విధిస్తాడు!" అన్నది నవ్వుతూ. "అదుగో వాకిట్లో రమేష్ కారు ఆగింది."

నేను లేచి నిలబడ్డాను. కాఫీ ఇక త్రాగాలనిపించలేదు. కప్పులో మిగిలివున్న కాఫీని అలాగే వదిలేసి బయటకు వచ్చాను ఆమె అడ్డు చెబుతున్నా లక్ష్యపెట్టకుండా.

⁘ ⁘ ⁘

ఇంకా సూర్యోదయం కాకముందే మెళుకువ వచ్చింది. రాత్రి కలత నిద్ర. ప్రతిక్షణం నవ్వుతున్న సరోజ ముఖం. అందులోనుంచి విషం చిమ్ముతున్నట్లుగా వస్తున్న మాటలు.

మనుష్యుల్ని చంపేటంత ధైర్యం ఆ అమ్మాయికి ఎలా లభించిందో నాకు అర్థం కావడంలేదు.

కళ్ళు తెరుచుకొని మంచం మీద దొర్లడమంత చికాకు మరొకటివుండదు. లేచాను. లేచి ముందు గదిలోకి వచ్చి కిటికీ తలుపు తెరిచాను.

సరిగ్గా అప్పుడే ఎదురింటి మేడ ముందు ఆటో ఆగింది. అందులో నుంచి సరోజ దిగి వడివడిగా పరుగెడుతున్నట్లుగా మేడ మెట్లెక్కేసింది.

ఆమె అప్పుడు ఎక్కడనుంచి వస్తున్నదో అర్థమయింది.

రాత్రి ఏ హోటల్ గదిలోనో ఖరీదయిన మంచాల మీద ఓ కామాంధుడి చేతిలో నలిగి నలిగి వాడిన రెక్కలతో సూర్యోదయపు వెలుగును భరించలేనట్లుగా ఎగిరివచ్చి గూటిలో దూరిపోయింది.

ఛ! ఛ! ఎంత నికృష్టపు బ్రతుకు?

నా మనస్సంతా ఆమె మీద తిరస్కార భావంతో నిండిపోయింది. కళ్ళల్లో అసహ్యం. చూపుల్లో ఏవగింపు.

నా హృదయం మీద- రేగి ముఖం మీద పడుతున్న జుట్టును కుడిచేత్తో వెనక్కు నెట్టుకుంటూ ఘోరమైన తప్పిదం చేసి పరుగెడుతున్న నేరస్థురాలిలా వున్న ఆమె రూపం ముద్రింపబడింది. అది జీవితంలో చెరగదు.

ఎందుకు అప్పుడు లేచానా, ఎందుకు ఆ కిటికీ తలుపు తెరిచానా అన్నంత నీరసం ఆవరించింది. తిరిగి వెళ్ళి మంచం మీద బరువెక్కిన గుండెతో వాలిపోయాను.

ఆ బరువు కరిగి నాకు ఊపిరి పీల్చుకునే అవకాశమే లేకుండా ఆఫీసుకు వెళ్ళిన అరగంటలోనే మా ఆఫీసరు గదిలోనుండి పిలుపు... ఫోను వచ్చిందంటూ... చేసింది సరోజ.

"ఏమిటి?" అన్నాను విసుగ్గా.

"ఆ భ్రాష్టుడికి శిక్ష విధించడం అయిపోయింది. అదంతా ఎలా జరిగిందో చెప్పడానికిగాను మీరు సాయంత్రం బయటకు వచ్చే టైంకు ఆఫీసుకు వస్తున్నాను!"

"వద్దు."

"నేను మీ కోసం వచ్చినట్లుగా నలుగురికీ తెలియడం మీకిష్టం లేదా? అవునులెండి. చెడిపోయిన ఆడదానితో మాట్లాడడం అంటే... అందునా నలుగురిలో... చాలా అవమానం గదూ!"

నా కోపపు వేడి మీద తడిగుడ్డలు పరుస్తున్నట్లుగా వున్న ఆ మాటలకు కించిత్ బాధపడ్డ మాట వాస్తవం.

"అదికాదు."

"మరి ఆఫీసు దగ్గరకు వస్తే ఏమౌతుంది?"

నేను అసహనంగా అటూ యిటూ కదులుతూ, "ఒక పని చేయండి. అయిదన్నరకు కామత్‌లో వుండండి" అన్నాను. అసలు మా ఆఫీసరు గదిలో ఆమెతో ఫోనులో అంతసేపు మాట్లాడడమే నాకు ఇష్టం లేదు.

"గుడ్!" ఫోను పెట్టేసింది.

అతడికి శిక్ష విధించానంటున్నది. ఎలా అమలు జరిపిందో తెలుసుకోవాలనే ఉత్సుకత. కానీ మనుష్యులకు మరణశిక్షలు విధించే ఆమెతో మాట్లాడటం అంటేనే కత్తుల మీద నడవడంలా భయం. లేనిపోని రొంపిలో నేను ఇరుక్కోను గదా? సాయంత్రం కామత్‌కు వెళ్ళకపోతే రేపు చెప్పాపెట్టకుండానే ఆఫీసుకు వచ్చి ఎదురుగ్గా కుర్చీ లాక్కొని కూర్చోవచ్చు.

ఆ అనుమానం నన్ను నిలువనీయలేదు. మాట ఇచ్చిన ప్రకారం కామత్‌లో కాలుపెట్టాను. లోపల కూర్చొని నా కోసమే అన్నట్లుగా వాకిలి వంక చూస్తున్నది సరోజ.

"హాయ్!"

నేనూ చేయెత్తి దించాను సమాధానంగా.

"మీరు నన్ను అభినందించాలి!"

"మరో మనిషిని చంపినందుకా? చంపుతున్నందుకా?" చాలా చిన్నగా, చిరాగ్గా అడిగాను. "చెప్పండి!"

"కాఫీనా? టిఫెనా?" కంఠంలో ఎగతాళి చాలా స్పష్టంగా కనబడుతోంది.

ఎదురుగ్గా వున్న మంచినీళ్ళ గ్లాసెత్తి ఆమె ముఖం మీద పోయాలన్నంత కోపం వచ్చింది. నిగ్రహించుకున్నాను అది నలుగురూ తిరిగే ప్రదేశమవ్వడంతో.

నా ముఖంలోని మార్పును గమనించినట్లుగా నవ్వును ఆపి, సీరియస్‌గా ముఖం పెట్టి, "రాత్రితో అతడి పని అయిపోయింది!" అన్నది నా వంకే సూటిగా చూస్తూ.

నేను మాట్లాడలేదు.

"ఎలా అని అడగరేం?"

"మీరు చెబుతారు గదా?" చాలా నిర్లక్ష్యంగా అన్నాను.

ఆమె ఒక్కక్షణం ఆగింది, నా మాటకు మనస్సు నొచ్చుకుంటున్నట్లుగా ఓ నిట్టూర్పు విడిచి. "అవును... చెబుతాను వినండి!" మాటలు వత్తిపలుకుతూ మొదలుపెట్టింది. "రాత్రి ఓ స్టార్ హోటల్‌లో ఏసీ గది, సుగంధపరిమళాల నడుమ మసక వెలుగులో తెల్లవార్లూ రమేష్ చేతిలో రబ్బరుబొమ్మలా గడపవలసిన రాత్రి. తొమ్మిదింటికల్లా రూంలో వుండాలని మా నిర్ణయం. రాత్రి తొమ్మిదయింది. నేను వెళ్ళలేదు. తొమ్మిదిన్నరయింది. నేను వెళ్ళలేదు. అక్కడ ఆ గదిలో తొమ్మిది గంటలకల్లా నాకు తెలిసిన ఓ అమ్మాయి నా కోసమే ఎదురు చూస్తున్నట్లుగా కూర్చుని వుంది. రమేష్ వచ్చాడు. రమేష్ సంగతి తెలుసు కదా. అడుక్కుండేవాడు చెత్తకుండీ దగ్గర ఎంగిలి మెతుకులు కనబడ్డా పంచభక్ష్య పరమాన్నాలు చూసినంత సంబరంగా ఎగిరి పడతాడు. నవ్వులు చిందించాడు. చేతులు కలిపాడు. పావుగంటలోనే శరీరాలు కలిసినాయి. నేను పది గంటలకు ఆ గదిలో కాలు పెట్టేటప్పటికే ఆ స్కౌండ్రల్ విందు భోజనం అయినంత తృప్తిగా త్రేన్చాడు!" మంచినీళ్ళ గ్లాసెత్తి గడగడా త్రాగేసింది.

"అతడికి మరింత ఆనందాన్నిచ్చి శిక్ష విధించినట్లుగా తృప్తి పడుతున్నావన్నమాట!" కంఠంలో వగరు.

"కాదు... ఆ అమ్మాయిని ఎన్నికచేసి, అందంగా అలంకరించి, నాటకీయంగా నా కోసమే ఎదురుచూస్తున్నట్లుగా కూర్చోబెట్టి, తరువాత వాడిని బరిలోకి దించినందుకుగాను, నేను వెచ్చించిన మూల్యం ఎంతో తెలుసా?"

నేను నవ్వాను- మీ ధరలేమిటో నాకెలా తెలుస్తాయి అన్నట్లుగా!

నా నవ్వుకు ఆమె చిన్నబుచ్చుకోలేదు. అసలు నా నవ్వును గమనించనట్లే, "రమేష్ ఈజ్ అవుట్!" రెండు చేతులూ బార్లా చాచి నోరంతా తెరిచి నవ్వుతూ చాలా హాయిగా, సంతోషంగా, విజయం సాధించినట్లుగా ఆ కుర్చీలో వెనక్కు వాలింది. "రెండు వేలు... రెండు వేలిచ్చి ఓ ఎయిడ్స్ పేషెంట్‌ను నా జీవితాన్ని ముక్కలు ముక్కలు చేసిన ఆ రాక్షసుడి కోసం మరీ వెతికి వెతికి పట్టుకు వచ్చాను!" మరో భయంకరమైన నవ్వు. "అదే నా మాటల్లో విన్నప్పుడు అతడు నా ముందునుంచి క్షణాల్లో పరారు!"

నాకు ఒళ్ళు గగుర్పొడిచింది ఆమె కంఠానికి...

బిగుసుకుపోయి ముందుకు వంగాను భయం భయంగా ఆమె ముఖంలోకి చూస్తూ.

"బేరర్! రెండు వెరీ వెరీ స్ట్రాంగ్ కాఫీ... సుగర్ తక్కువ!" ఆ నవ్వు నడుమ పెద్ద అరుపు.

✣ ✣ ✣

నాలుగు రోజుల తరువాత ఓ సాయంత్రం ఆఫీసునుండి ఇంటికి వస్తూ, చిక్కడపల్లి సెంటర్‌లో కాఫీ తాగి రోడ్డు వారగా నడుస్తున్నాను.

పడమటనుంచి మబ్బులు పరుగెట్టుకుంటూ వస్తున్నాయి. చల్లటిగాలి. నారాయణగూడా బ్రిడ్జి దగ్గరకు వచ్చేటప్పటికి రోడ్డు మధ్యగా ఓ గుంపు. పక్కగా లారీ. ఏదో యాక్సిడెంట్‌లా వున్నది.

చిన్నా, పెద్దా... ఎవరో చూద్దాం అన్నట్లుగా గుంపులోకి తల దూర్చాను. నెత్తుటి మడుగు మధ్యగా ఓ పెద్దాయన... చచ్చినట్లున్నాడు. ధోవతంతా రక్తమయం. తల పక్కకు వాల్చి వెల్లికిలా పడివున్నాడు. తెలిసిన ముఖంలా అనిపించగా ఇంకో రెండడుగులు ముందుకు వేశాను.

అతడు సరోజ తండ్రి!

ఒళ్ళు గగుర్పొడిచింది. ఒక్క ఉదుటున బయటకు వచ్చేశాను.

అతడు నాకేం ఆత్మీయుడుకాదు. అయినా చూసిన మనిషి, తెలిసిన మనిషి అవ్వటంతో గుండె దడదడలాడింది.

మా ఇల్లు అక్కడకి నడిచే దూరమే అయినా ఆలస్యం భరించలేనట్లుగా ఆటో ఎక్కాను.

మా ఇంటి ఎదురుగ్గా వున్న మేడముందు ఆటో దిగి డబ్బులిచ్చి పంపి వడివడిగా మేడ మెట్లెక్కాను.

బాల్కనీలో ముసలమ్మ నిల్చొని పూలకుండీలలో నీళ్లు పోస్తున్నది.

"సరోజను పిలువు!" త్వరత్వరగా అన్నాను.

సరోజ ముందుగదిలోనే వున్నట్లున్నది. నా మాట వింటూనే బయటకు వచ్చి, నన్ను చూస్తూనే ముఖాన్ని విశాలం చేసుకొని నవ్వుతూ, "రండి" అన్నది.

"మీ నాన్నకు యాక్సిడెంట్ అయింది!"

గడపవతలనుండి బాల్కనీలోకి ఒక్క దూకు దూకింది సరోజ.

"బ్రతికున్నాడా? చచ్చాడా?"

"చచ్చిపోయ్యాడు!"

ఒక్కసారిగా ఆమె నుండి నవ్వుల వెల్లువ సముద్రపు అలల ఘోషలా ఉబికి వచ్చింది.

అదో శబ్దం. భయంకరమైన శబ్దం. పొట్ట పట్టుకొని ముందుకు వంగి వస్తున్న నవ్వును ఆపుకోలేనట్లుగా ఊగి పోతున్నది. ఆమె నుండి వెలువడుతున్న ఆ శబ్దానికి పడమటివేపు నుండి వీస్తున్న చల్లటి గాలిలో గూడా నా ఒళ్ళు చమటలు పడుతోంది. అమెను ఏదో భయంకరమైన భూతం ఆవరించి నిలవనీయడం లేదేమోననిపిస్తోంది.

"వాహ్! ఎంత మంచి వార్త చెప్పావు, మిత్రమా!"

ఆమె పడీ పడీ నవ్వుతూనే వుంది. ఆమెకు ఊపిరి అందనట్లుగా ఆయాస మొస్తున్నది. రొప్పు వస్తున్నది. ముఖమంతా స్వేద బిందువులతో తడిసి ముగ్ధవుతున్నది. ఆమె చేతుల మీదగా నీరు జలజలా కారుతోంది. ఆమె కళ్ళు నీళ్ళతో నిండిపోయినయి.

ఆమె నవ్వి నవ్వి గుండెలవిసిపోయి, అలసిపోయి, ఇక నిలబడలేక కుప్పలా నా కాళ్ళకు దగ్గరగా కూలబడి పోయింది.

"నా అనుమానమే నిజమయితే... అది యాక్సిడెంట్ కాదు... ఆత్మహత్యే!" చేతులు గాలిలోకి విసురుతూ అన్నది.

నాకు సరోజతో ప్రతిదీ అయోమయమే.

ఎలాటివాడైనా తనకు జన్మనిచ్చిన తండ్రి పోయాడూ అన్నప్పుడు ఆమె స్పందన నాకు చాలా ఎబ్బెట్టుగా తోచింది. తండ్రిని ద్వేషించవచ్చు కానీ పసుపు కుంకుమలు పోగొట్టుకున్న తల్లి రూపం ఆమె ఊహకు అందడం లేదు.

నాకు ఆమె ప్రవర్తన చాలా అసహ్యం కలిగించగా- మీ చావు మీరు చావండి అన్నట్లుగా వెనక్కు తిరిగాను.

"నా అనుమానానికి కారణం గూడా చెబుతాను... మీరు నా అభిమానులు... నన్ను మన్నించి నేను చెప్పేది విని వెళ్ళండి!"

"చెప్పు!" ఆగాను.

"ఆయన ఎందుకు ఆత్మహత్య చేసుకొని వుంటాడో మీకు తెలుసా?"

"నువ్వూ మీ వాళ్ళూ ఎందుకు, ఎప్పుడు, ఏం చేస్తారో ఎవరికైనా తెలుస్తుందా?" విసురుగా అన్నాను.

నా కోపాన్ని, విసుగునుగాని పట్టించుకోకుండానే, "ఆయనకూ మీలాగానే నాచేత ఉద్యోగం చేయించాలని కోరిక పుట్టింది. మీరు నిజాయితీగా నాకు సహాయం చేయ ప్రయత్నిస్తే ఆయన స్వార్థంతో ఆ ఏర్పాటు చేయ ప్రయత్నించాడు!" తలవంచుకున్నది ఆవేశాన్ని అణుచుకో ప్రయత్నిస్తున్నట్లుగా.

"దానిదేముంది? ఉద్యోగం ఉద్యోగమే... ఏ ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసినా!"

"ఎలా అవుతుంది... కాదు... ఆయన ఉద్దేశ్యప్రకారం నేను ఓ పెద్ద కంపెనీ యజమానికి శాశ్వత ఉంపుడుకత్తెగా వుండటమే ఆ ఉద్యోగం. అందుకువచ్చే జీతం పదిహేను వేలు. దాన్ని ఆయన తీసుకు వెళ్ళిపోతాడు. ఇక నా ఖర్చుల విషయంలో ఆయన నాకిచ్చిన సలహా ఏమిటో తెలుసా- ఆ కంపెనీ యజమానికి తెలియకుండా నేను చిలక్కొట్టుడు వ్యవహారాలు చేసి డబ్బు సంపాదించుకోవాలి. అవి నా స్వంతం. అందులో ఒక్క పైసా గూడా ఆయన ఆశించడు. నన్ను భూమ్మీద పుట్టించిన ఓ తండ్రీ! నీకు నా మీద ఉన్న అభిమానానికి ఎల్లల్లేవు. హాట్సాఫ్! సరే అన్నాను ఆయన మనస్సు కష్ట పెట్టటం ఎందుకన్నట్లుగా! అయినా ఆ గొప్ప మనిషికి నేను నచ్చాలి గదా... అందుకే బాగా అలంకరించుకొని ఇంటర్వ్యూకి వెళ్ళి రమ్మనమన్నాడు. అట్లాగే వెళ్ళి వచ్చాను. వెళ్ళి వచ్చి..." ఒక్క క్షణం ఆగింది. తరువాత నా వేపుకే సూటిగా చూస్తూ, "వెళ్ళి వచ్చి

అ మూర్ఖుడికి ఓ రస్సా ఇచ్చాను. అది ఎంత బలంగా అతడి గుండెలకు తాకిందంటే ఆ దెబ్బకే లారీ కింద పడి చచ్చాడు!"

సరోజ ఆగి అప్పటిదాకా బిగపట్టుకున్న ఊపిరిని స్వేచ్ఛగా వదులుతున్నట్లుగా ఓ దీర్ఘమైన నిట్టూర్పు విడిచింది. ఆపైన శూన్యంలోకి చూస్తున్నట్లుగా కనురెప్పలార్పకుండా ఆకాశంలోకి చూడసాగింది కళ్ళు పెద్దవి చేసుకొని.

ఆ క్షణాన ఆమె ముఖం బాధతో విలవిలలాడుతోంది.

"పూజ్యురాలయిన నా తల్లిని కించపరిచే మాట ఒకటి అన్నాను. అదే నా జీవితాంతం గుండెల్లో రేగే మంట. ఆ మంటలార్పడం నావల్ల కాదు!" ఆమె కన్నీటిని ఆపుకో ప్రయత్నించలేదు.

నాకు ఆ క్షణాన ఏ విధంగానూ ఆమెను అనునయించాలనిపించలేదు. అమెంతట ఆమే ఆ బాధనుండి కోలుకోవాలి అన్నట్లుగా, బాల్కనీ పిట్టగోడ పట్టుకొని ముఖం పక్కకు తిప్పుకొని రోడ్డు మీదకే చూస్తూ ఉండిపోయాను. కొన్ని గాయాలకు కాలమే సరి అయిన మందు అవుతుంది.

"ఇంటర్వ్యూకి వెళ్ళి వచ్చాను. ఆ కంపెనీ యజమానికి భార్యలేదు. నా వయస్సు పిల్లలున్నారు. వాళ్ళ ముందు నన్ను ఇంట్లో పెట్టుకోవడం చాలా ఇబ్బందిగా ఉంటుందన్నట్లుగా మాట్లాడాడు... నేను మా భ్రాష్టుడికి అలా చెప్పడం మొదలు పెట్టాను. అందుకే క్కాస్త పెద్దామె, అందగత్తె అయి వంట మనిషిలా వుండి పిల్లలకు తిండి, తనకు అన్నీ సమకూర్చేలా వుంటే నువ్వు ఆశించిన జీతం ఇస్తానన్నాడు నాన్నా అన్నాను. అందుకే... అందుకే అతడి కోరికలన్నీ తీరుతాయి... నువ్వు కోరుకున్న డబ్బూ వస్తుంది... అమ్మను పంపకూడదా ఆయన దగ్గరకు అన్నాను!" రెండు చేతులతో ముఖాన్ని దాచుకున్నది సరోజ.

ఆ మాటలకు ఉలిక్కిపడి ఆమె వైపుకు తిరిగాను.

"ఏ కూతురూ తల్లిని అనగూడని అసహ్యకరమైన మాట అన్నాను!" ఆమె దుఃఖం కట్టలు తెగిన వరదే అయింది. "ఎంత ఛండాలుడైనా భార్య మాత్రం పవిత్రంగానే ఉండాలనుకుంటాడు. అందుకే నేనన్న మాటను భరించలేక కుళ్ళికుళ్ళి చచ్చాడు!"

చటుక్కున లేచి నిలుచున్నది.

పూల కుండీల దగ్గర కొయ్యబొమ్మలా నిలుచున్న ముసలమ్మను వేలెత్తి చూపుతూ, "ఓసే రాక్షసీ! అయిదు నిముషాల టైం ఇస్తున్నాను. నువ్వు ఈ ఇల్లు విడిచి రోడ్డెక్కక పోయావో నేనే నిన్ను మేడ మీదనుంచి క్రిందకు తోసేస్తాను!" అన్నది కళ్ళల్లోనుంచి నిప్పులు కురిపిస్తూ.

ఆమె లోపలకు పరుగెత్తింది.

రెండు నిముషాల నిశ్శబ్దం.

కళ్ళు పైకెత్తి నల్లటి మబ్బులతో వికృతంగా వున్న ఆకాశంలోకి సూర్యోదయం ఎప్పుడు అవుతుందా అన్నట్లుగా ఆశగా చూస్తున్నది సరోజ.

"చూడండి! మీరు నాకేదైనా ఉద్యోగం చిన్నదైనా సరే చూడండి. నేను గౌరవప్రదంగా బ్రతికేలా చేయండి. నా తల్లిని, నా తమ్ముళ్ళను, చెల్లెళ్ళను నేను గుండెలకు హత్తుకుని పోషిస్తాను. నా వాళ్ళను నేను ఆనందంతో పైకి తీసుకు వస్తాను. నా అంతరాత్మ సాక్షిగా నేను నా వాళ్ళకు ఈ సంఘంలో ఓ విలువైన జీవితాన్ని సమకూరుస్తాను!"

*(ఆంధ్రభూమి: వారపత్రిక: 19.02.1998 నుండి 12.03.1998 వరకు)*